17న తపాలా బీమా ఏజెంట్ల నియామకానికి ఇంటర్వ్యూలు

ఏలూరు: తపాలా శాఖలో తపాలా జీవిత బీమా (పిఎల్ఐ), గ్రామీణ తపాలా జీవిత బీమా (ఆర్‌పిఎల్ఐ) ఏజెంట్లుగా ఏలూరు డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పని చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 17వ తేదీన ఉదయం పదిగంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంటలోపు సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్, ఏలూరు డివిజన్, సత్రంపాడు వారి కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూకు నేరుగా తమ సర్టిఫికెట్లు తీసుకుని హాజరు కావాలని సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్ మహ్మద్ ఆసిఫ్ తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు తగిన శిక్షణ, అనంతరం వారు చేసిన పాలసీలకు ఆకర్షణీయమైన ఇన్సెంటివ్ చెల్లించబడుతుందన్నారు. 18 సంవత్సరాల నుండి 50 ఏళ్లలోపు వయోపరిమితి కలిగి ఉండి, పదో తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. పూర్తి వివరాలకు తమ దగ్గరలోని తపాలా కార్యాలయంలో లేదా కె.శ్రీనివాస బుచ్చిబాబు, డిఒ (పిఎల్ఐ) 08812-230053, 8885935548 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

సమరశీల పోరాటాలకు సిద్ధంకండి

సిఐటియు 16వ రాష్ట్ర మహాసభ పిలుపు
47 తీర్మానాలు ఆమోదం,
నూతన కమిటీ ఎన్నిక
భవిష్యత్ కార్యాచరణపై జాతీయ,
రాష్ట్ర నాయకుల దిశానిర్దేశం
ఏప్రిల్ 5న చలో ఢిల్లీ..
మార్చిలో చలో అసెంబ్లీకి పిలుపు

'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా రాబోయే కాలంలో సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని, క్షేత్రస్థాయిలో సంఘాన్ని బలోపేతం చేసి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఐక్య ఉద్యమాలు విస్తృతం చేయాలని, భవిష్యత్తు పోరాటాలను ఏవిధంగా ముందుకు తీసుకెళ్లాలో కార్మిక నేతలకు భీమవరంలో మూడు రోజులపాటు జరిగిన సిఐటియు 16వ రాష్ట్ర మహాసభ దిశానిర్దేశం చేసింది. మహాసభ చివరిరోజు బుధవారం నూతన కమిటీని ఎన్నుకుంది. జాతీయ, రాష్ట్ర నాయకులు చేసిన సందేశాలు ప్రతినిధుల్లో నూతనోత్సాహాన్ని నింపాయి.

ప్రజాశక్తి - భీమవరం

భీమవరంలో ఈ నెల రెండో తేదీ నుంచి మూడు రోజులపాటు జరిగిన సిఐటియు 16వ రాష్ట్ర మహాసభ బుధవారంతో ముగిసింది. ఈ మహాసభలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సమస్యలపై ప్రధానంగా చర్చించి భవిష్యత్ కార్యాచరణకు మహాసభ దిశానిర్దేశం చేసింది. మహాసభకు హాజరైన సుమారు 800 మంది ప్రతినిధులు సంఘం పనితీరు, చేసిన ఉద్యమాలు, పోరాటాలు, రాబోయే కాలంలో చేపట్టబోయే ఉద్యమ కార్యాచరణ రూపొందించుకున్నారు. మహాసభ మొదటిరోజు సావిత్రమ్మ, టి.షడ్రక్ స్మారక నగర్ (శ్రీ అల్లూరి శ్రీరామరాజు కళ్యాణ మండపం) ఆవరణలో సీనియర్ నాయకులు, మాజీ ఎంఎల్ఎ రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్‌ఎస్) సిఐటియు జెండాను ఆవిష్కరించి మహాసభను ఘనంగా ప్రారంభించారు.

మహాసభలో మాట్లాడుతున్న తపన్‌సేన్

అనంతరం అమరవీరుల స్తూపానికి జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకులతోపాటు హాజరైన ప్రతినిధులంతా నివాళులర్పించారు. సభకు హాజరైన నాయకులను సభా వేదికపైకి సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.గఫూర్ ఆహ్వానం పలకగా ఆహ్వాన సంఘం సహాధ్యక్షులు బి.బలరాం ఆహ్వాన సంఘ అధ్యక్షోపన్యాసం చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న సిఐటియు రాష్ట్ర మహాసభకు ఎందరో మహానుభావులు నడయాడిన నేలపై కార్మిక ప్రతినిధులకు అతిథ్యం ఇవ్వడం గర్వంగా భావిస్తున్నామన్నారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నరసింగరావు అధ్యక్షతన జరిగిన సభలో ఆలిండియా ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ ప్రారంభోపన్యాసం చేశారు. ప్రత్యేక పరిస్థితుల్లో ఈ మహాసభ జరుగుతుందని, సంఘాలన్నీ మరింత శక్తివంతం చేసుకుని నిర్ణయాలు చేయాలని సూచించారు. కార్పొరేట్ కమ్యూనల్ పెట్టుబడిదారుల పాలన తిప్పికొట్టే విధంగా ముందుకు సాగాల్సి ఉందని పిలుపునిచ్చారు. ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేషు సౌహార్ద్ర సందేశం ఇచ్చారు.

మహాసభకు హాజరైన ప్రతినిధులు

అబ్బురపరిచేలా ప్రదర్శన

సోమవారం మధ్యాహ్నం పాత బస్టాండ్ సెంటర్ నుంచి కొత్త బస్టాండ్ వరకు భారీ కార్మిక ప్రదర్శన జరిగింది. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన కార్మిక ప్రతినిధులతోపాటు కార్మికులు ప్రదర్శనలో పాల్గొన్న తీరు ఎర్ర సముద్రాన్ని తలపించింది. కార్మిక దళం రాకతో పురవీధులన్నీ కిక్కిరిసిపోయాయి. ఈ మహాప్రదర్శన ప్రజలను ఆకట్టుకున్న తీరు వర్ణనాతీతం. వ్యవసాయ కార్మిక సంఘం, యుటిఎఫ్, శ్రామిక మహిళ, ఐద్వా, బజారు లాగుడు బళ్లు, భవన నిర్మాణ కార్మికులతోపాటు అనేక సిఐటియు అనుబంధ సంఘాలు, ప్రజాసంఘాలు మహా ప్రదర్శనకు అడుగడుగునా స్వాగతం పలికాయి. కేశవరావు హైస్కూల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నరసింగరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి కేరళ న్యాయ, పరిశ్రమల శాఖ మంత్రి పి.రాజీవ్ మాట్లాడుతూ దేశంలో అనేక భాషలు, రకరకాల ఆహారపు అలవాట్లు, వస్త్రధారణ పద్ధతులు ఉన్నప్పటికీ అంతా కలిసిమెలిసి జీవిస్తుండటం ఒక ప్రత్యేకతగా ఉందన్నారు. అలాంటి లౌకికతత్వానికి బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ రూపంలో ప్రమాదం ఏర్పడుతుందని చెప్పారు. ఆర్‌ఎస్ఎస్ ప్రజాస్వామిక లౌకిక దేశంగా ఉన్న భారతం హిందూదేశంగా మార్చాలని చూస్తుందన్నారు. ఇది దేశానికి అత్యంత ప్రమాదకరమన్నారు. కేరళలో వామపక్ష ప్రభుత్వాన్ని అక్కడి ప్రజలు గెలిపించారని చెప్పారు. భూపంపిణీ, నాణ్యమైన వైద్యం, విద్య వంటి విధానాలు కేరళలో అమలు చేశామన్నారు. సిఐటియు జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.గఫూర్, ఉభయగోదావరి జిల్లాల పిడిఎఫ్ ఎంఎల్‌సిలు షేక్ సాబ్జీ, ఇళ్ల వెంకటేశ్వరరావు, జాతీయ ఉపాధ్యక్షురాలు బేబీరాణి ఈ బహిరంగ సభలో మాట్లాడారు. రెండో రోజు సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.గఫూర్ రాష్ట్ర మహాసభలో కార్యకలాపాల నివేదికను ప్రతినిధుల సభలో ప్రవేశపెట్టి మాట్లాడారు. ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం వాటిని అమలు చేయకపోగా, వాటిని అమలు చేయాలని కోరుతున్న ఆయా తరగతుల కార్మికులపై నిర్బంధానికి పాల్పడుతుందని, దీన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. తొలుత ఇటీవల కాలంలో మృతి చెందిన అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర నాయకులు, కరోనా విపత్కర కాలంలో.. ప్రమాదాల్లో.. రైతన్న ఉద్యమాల్లో మరణించిన వారికి నివాళులర్పిస్తూ అజయ్‌కుమార్ ప్రవేశ పెట్టిన సంతాప తీర్మానానికి మహాసభ ఆమోదం తెలిపింది. ప్రతినిధులు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించింది. కార్యకలాపాల నివేదికపై ప్రతినిధులు జిల్లాలవారీ గ్రూపు చర్చలు నిర్వహించి ఆయా జిల్లాల నుంచి తమ ఉద్యమ అనుభవాలను వివరించారు. 27 జిల్లాల కార్మిక ప్రతినిధులు తమ అభిప్రాయాలు తెలిపి కార్యదర్శి నివేదికకు ఆమోదం తెలిపారు. ఉద్యమాలు, పోరాటాలు, సేవా కార్యక్రమాలు, కార్మిక సమస్యలతోపాటు ప్రజా సమస్యల పరిష్కారానికి చూపిన చొరవ సాధించిన ఫలితాలను వివిధ జిల్లాల ప్రతినిధులు మహాసభ ముందుంచారు.

గ్రూపు చర్చల్లో జిల్లా నేతలు

సిఐటియు రాష్ట్ర కార్యదర్శిగా డిఎన్‌విడి.ప్రసాద్

మరో నలుగురు రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నిక

ప్రజాశక్తి - భీమవరం

సిఐటియు రాష్ట్ర కార్యదర్శిగా డిఎన్‌విడి.ప్రసాద్ ఎన్నికయ్యారు. ఈయనతోపాటు ఏలూరు జిల్లా నుంచి మరో నలుగురు రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. భీమవరంలో మూడు రోజులపాటు జరిగిన సిఐటియు 16వ రాష్ట్ర మహాసభలో నూతన కమిటీ ఎన్నికైంది. రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఆర్.లింగరాజు, బి.సోమయ్య, కె.విజయలక్ష్మి, నారపపల్లి రమణరావు ఎన్నికయ్యారు.

సేవలందించిన 200 మంది వాలంటీర్లు

ప్రజాశక్తి - భీమవరం

భీమవరంలో మూడు రోజులపాటు జరిగిన సిఐటియు 16వ రాష్ట్ర మహాసభలో 200 మంది వివిధ రంగాలకు చెందిన కార్మికులు అనేక రకాల సేవలందించారు. మహాసభ తేదీలు ప్రకటించినప్పటి నుంచి పట్టణంలో గోడ రాతలు, తోరణాల అలంకరణలు, ఫ్లెక్సీ బ్యానర్లు, భారీ స్వాగత కటౌట్ల ఏర్పాటుకు ఎంతో కృషి చేశారు. ప్రతినిధుల సభకు వచ్చిన వారికి అల్పాహారం, భోజనం వడ్డించడంతోపాటు వారికి ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా సేవలందించారు.

గోదావరి జిల్లాలు అంటే సంస్కృతీ సంప్రదాయాలకు పెట్టింది పేరయిన జిల్లాకు వచ్చిన అతిథులకు అతిథ్యం అందించడంలో వారికి ఎవరూ సాటిరారని చెబుతుంటారు. రాష్ట్ర మహాసభకు విచ్చేసిన ప్రతినిధులకు సిఐటియు జిల్లా కమిటీ అందించిన అతిథ్యం ప్రతినిధులు ఉబ్బితబ్బిబయ్యారు.

ఉచిత వైద్య సేవలు

ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ప్రతినిధులకు అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు.

47 తీర్మానాలు ఆమోదం

మహాసభలో మొత్తం 47 అంశాలపై ప్రతినిధులు చర్చించి తీర్మానాలను ఆమోదించింది. కనీస వేతనాల అమలు, విశాఖ ఉక్కు అమ్మకాన్ని వ్యతిరేకిస్తూ, చలో ఢిల్లీ, ప్రజాఉద్యమాలపై నిర్బంధాలను నిరసించడం వంటి తీర్మానాలను మహాసభ ఆమోదించింది. స్థానిక కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన మీడియా పాయింట్లో సభ ఆమోదించిన తీర్మానాలపై రాష్ట్ర నేతలు వివరించారు. రాష్ట్రంలో 50 లక్షల మంది అసంఘటితరంగ కార్మికులు పని చేస్తున్నారని, సమగ్ర చట్టాన్ని వెంటనే చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు , సిఐటియు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్, రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి సౌహార్థ సందేశాలిచ్చారు. జాతీయ నేతలు సాయిబాబు, ఆర్.లక్ష్మయ్య మాట్లాడారు. మహాసభ తీర్మానాలకు అనుగుణంగా రాబోయే రోజుల్లో పోరాటాలు నిర్వహించాలని కార్మిక ప్రతినిధులు ప్రతినబూనారు. చలో ఢిల్లీ, చలో అసెంబ్లీ కార్యక్రమాలను జయప్రదం చేయాలని మహాసభ పిలుపునిచ్చింది. రాబోయే రోజుల్లో సమరశీల పోరాటాలకు సమాయత్తం కావాలని మహాసభ పిలుపునిచ్చింది.

మాట్లాడుతున్న గఫూర్

ఉమామహేశ్వరరావు

కోడిపందాలపై ఉక్కుపాదం

నిరంతర నిఘాతో అడ్డుకట్ట
నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు
గ్రామ, మండల స్థాయిలో కమిటీలు
ఆర్‌డిఒ కార్యాలయాల్లో 24/7 కంట్రోల్ రూము
జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో కోడిపందేలు, గుండాట, జూదాలు, అక్రమ మద్యం రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు నిరంతర పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో బుధవారం కోడిపందేలు, గుండాట, జూదాలు, అక్రమ మద్యం రవాణాపై పోలీసు, రెవెన్యూ, ఎస్ఇబి, ఎక్సైజ్ తదితర శాఖల అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో కలెక్టర్, జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా, మండల స్థాయి అధికారులతో వారు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి కోడిపందేల నియంత్రణకు స్పష్టమైన మార్గదర్శకాలతో దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కోడిపందేలు నిర్వహించాలంటే భయపడేలా చర్యలుండాలని, అధికారులు ఆ దిశగా నిఘా, నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. కోడిపందేల నిర్వహణకు పాల్పడే వారితోపాటు పాల్గొన్న వారిపై కూడా చట్టపరమైన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. కోడి పందేల నియంత్రణపై గతంలో గౌరవ హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడైనా కోడిపందేలు జరిగితే సంబంధిత గ్రామ, మండల, డివిజన్ కమిటీలే బాధ్యత వహించవలసి వస్తుందని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్రామ, మండల స్థాయిలో జాయింట్ యాక్షన్ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్‌డిఒ కార్యాలయంలో 24 గంటలూ పనిచేసేవిధంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, సంబంధిత ఫోన్ నెంబర్లను ప్రజలకు తెలిసేవిధంగా ప్రముఖ ప్రాంతాల్లో బ్యానర్ల ద్వారా ప్రదర్శించాలన్నారు. హైకోర్టు ఆదేశాల సమాచారాన్ని కూడా స్పష్టంగా ఆయా బ్యానర్లలో ప్రదర్శించాలన్నారు. మండల కమిటీలో తహశీల్దార్, ఎస్‌హెచ్‌ఒలతో కూడిన నిఘా బృందాన్ని ఏర్పాటు చేయాలని, అదేవిధంగా గ్రామ స్థాయిలో మహిళా పోలీసు, పంచాయతీ కార్యదర్శితో పాటు సచివాలయంలోని పశుసంవర్ధక శాఖ, మత్స్య శాఖ, ఉద్యానవన శాఖలలో ఏదైనా ఒక శాఖకు సంబంధించిన ఒక ఉద్యోగితో కూడిన కమిటీ నియమించాలన్నారు. ప్రతీ గ్రామంలో టాం టాం ద్వారా కోడిపందేల నియంత్రణ విషయంపై తెలియపరచాలన్నారు. కోడి పందేల నియంత్రణకు వారి పరిధిలో తీసుకుంటున్న చర్యలను ఆర్‌డిఒలు, తహశీల్దార్లు తరచూ మీడియాకు తెలియజేయాలన్నారు. కోడిపందేలు నిర్వహించేందుకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో మరింత నిఘా ఉంచాలన్నారు. మండలస్థాయిలో కోడిపందాలు ఎవరైనా నిర్వహిస్తుంటే సమాచారాన్ని మండల కమిటీకి తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. నాటుసారా, అక్రమ మద్యం నియంత్రణపై మరింత నిఘా ఉంచాలన్నారు. అదేవిధంగా అధిక పరిమాణంలో మద్యం కొనుగోలు చేసే వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

డివిజన్‌స్థాయిలో ఆటల పోటీలు : కోడిపందేలు, జూదం వంటివాటిపై యువత ప్రభావితం కాకుండా కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ వంటి క్రీడా పోటీలను డివిజన్‌స్థాయిలో నిర్వహించాలని సబ్ కలెక్టర్, ఆర్‌డిఒలను కలెక్టర్ ఆదేశించారు. తొలుత మండల స్థాయిలో పోటీలు నిర్వహించి, వాటిలో ప్రతిభ కనబరచిన వారికి డివిజన్ స్థాయిలో పోటీలు నిర్వహించి బహుమతులు ఇవ్వాలన్నారు. బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమాల్లో తాను, జిల్లా ఎస్పి కూడా పాల్గొని విజేతలకు బహుమతి ప్రదానం చేస్తామని చెప్పారు.

జిల్లా ఎస్పి రాహుల్ దేవ్ శర్మ మాట్లాడుతూ కోడి పందేలు అదుపు చేసేందుకు పంచాయతీ, సచివాలయ, పోలీసు, రెవెన్యూ శాఖల సిబ్బందితో బృందాలు ఏర్పాటు చేస్తామన్నారు. కోడి పందేల నిర్వహణకు చేసే ఏర్పాట్లు ముందుగానే గుర్తించి వాటిని నిరోధించాలన్నారు. ఇందుకు ప్రత్యేక పెట్రోలింగ్ చేపట్టాలన్నారు. ముఖ్యంగా జంగారెడ్డిగూడెం, చింతలపూడి ప్రాంతాల్లో దృష్టి పెట్టాలన్నారు. పోలీసు, రెవెన్యూ అధికారుల సమన్వయంతో కోడిపందేలు, జూదం నియంత్రణకు ప్రత్యేక ప్రణాళికను పటిష్టంగా అమలు చేయాలన్నారు. ఇప్పటికే కోడి పందేలు నిర్వహించే 552 మందిని బైండోవర్ చేసి 841 కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నామన్నారు. గ్రామీణ ప్రాంతంలో యువత దృష్టిని జూదాల నుండి మళ్లించేందుకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించాలన్నారు. గుండాటకు సంబంధించి బోర్డులు తయారీ, సరఫరా చేసేవారిని గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్ఇబి జాయింట్ డైరెక్టర్ ఎన్.సూర్యచంద్రరావు, ఆదాయపు పన్నుల శాఖ అధికారి ఇంతియాజ్, ఎస్ఇబి ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ అరుణకుమార్, అసిస్టెంట్ ఎన్ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ అమర్‌బాబు, ఏలూరు డిఎస్‌పి పైడేశ్వరరావు, పశు సంవర్ధక శాఖ జెడి జి.నెహ్రూబాబు పాల్గొన్నారు.

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

9/77 చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర ప్రభుత్వం అసైన్డ్ భూములను రెగ్యులర్ చేయాలా? వద్దా? అని విచారించడానికి మంత్రి ధర్మాన ప్రసాదరావు నేతృత్వంలో మంత్రులు, శాసనసభ్యులతో కమిటీని నియమించింది. ఆ కమిటీని వెంటనే రద్దుచేయాలని, దళితులు, బలహీనవర్గాలకు చెందిన పేదలకు ప్రభుత్వాలు ఇచ్చిన అసైన్డ్ భూములకు రక్షణగా ఉన్న విఒటి చట్టం 9/77ను సమర్థవంతంగా అమలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల్లో భూములను చేర్చి వాటిని పంచాలని వ్యవసాయ కార్మిక సంఘం రౌండ్ టేబుల్ సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ సమావేశానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి తీర్మానం ప్రవేశపెట్టారు. స్వాతంత్ర్యం అనంతరం 1954 నుండి 2009 వరకూ వామపక్షాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు, అభ్యుదయవాదులు చేసిన అనేక పోరాటాల వల్ల రాష్ట్రంలో సుమారు 30 లక్షల ఎకరాలకు పైగా పేదలకు ప్రభుత్వాలు అసైన్డ్ చేశాయన్నారు. పేదలకు ఇచ్చిన ఈ అసైన్డ్ భూములను రాష్ట్రంలో పలుకుబడి కల్గిన వారు, పెత్తందారులు, రాజకీయ నాయకులు, దళారులు పేదలను మభ్యపెట్టి అదిరించి, బెదిరించి బలవంతంగానో, పావలానో, పాతికో ఇచ్చి సుమారు 15 లక్షల ఎకరాల భూమిని లాక్కునట్లు కోనేరు రంగారావు భూ కమిటీ తెలిపిందన్నారు. అన్యాక్రాంతమైన భూములను పేదలకు తిరిగి అప్పచెబుతామని 2007లో అప్పటి ముఖ్యమంత్రి కీర్తిశేషులు వైఎస్.రాజశేఖర్ రెడ్డి అసెంబ్లీలో వాగ్దానం చేశారని తెలిపారు. అనంతరం వచ్చిన ప్రభుత్వాలు గానీ, ప్రస్తుత సిఎం జగన్ గానీ ఆ హామీని నెరవేర్చకపోగా రాష్ట్రంలో భూముల విలువ పెరిగిన తర్వాత దళిత, బలహీనవర్గాల పేదల భూములను మరింత దోచుకోవడం పెరిగిందని విమర్శించారు. పేదల భూములను సంపన్నులకు కట్టబెట్టడానికి 9/77 చట్టం అడ్డం వస్తుందని, కాబట్టి ఆ చట్టం నిర్వీర్యం చేసేందుకు ధర్మాన ప్రసాదరావు నేతృత్వంలో వేసిన కమిటీ ఉద్దేశంతప్ప మరొకటి లేదన్నారు.

బికెఎంయు జిల్లా కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు ఎఐడిఆర్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు మన్‌సింగ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, బిసి సంఘాల జెఎసి నాయకుడు గోపాలకృష్ణ, దళిత సంఘాల నాయకులు నేతల రమేష్, ఎం. జయబాబు, రైతు సంఘం నాయకులు కె.శ్రీనివాస్ చేతివృత్తుల సంఘం నాయకులు పి.ఆదిశేషు, రైతుకూలీ సంఘం నాయకులు తలారి ప్రకాష్, బికెఎంయు నాయకులు పెంటయ్య, రాజశేఖర్, సంఘం నాయకులు పి.ఆనంద్‌రావు, సిహెచ్.జాన్‌రాజ్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ మాట్లాడుతూ భూసంస్కరణ అమలు జరిగి, పేదల చేతుల్లోకి భూమి వచ్చినప్పుడే అన్ని రకాల అభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రపంచ అనుభవం అదే చెబుతుందని, కానీ మన దేశంలో నేటి ప్రభుత్వాలు పేదలకు భూపంపిణీ పక్కనపెట్టి పేదల భూములను కార్పొరేట్లకు, పెట్టుబడిదారులకు కట్టబెడుతున్నాయని మండిపడ్డారు. పేదలకు భూపంపిణీ కోసం చేసిన చట్టాలన్నింటినీ తుంగలో తొక్కి దళిత, గిరిజన, బలహీన వర్గాల పేదలకు తీవ్రమైన ద్రోహం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు . ఈ నేపథ్యంలో భూమిలేని గ్రామీణ పేదలకు భూపంపిణీ చేపట్టాలని, పేదలకు చెందిన అసైన్డ్ భూములను దౌర్జన్యంగా, అక్రమంగా అనుభవిస్తున్న భూస్వామ్య, సంపన్న వర్గాల నుండి తిరిగి తీసుకుని పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి అనే పేరుతో 2013 భూసేకరణ, పునరావాస చట్టాన్ని అమలు చేయకుండా దళితులు, పేదరైతులకు చెందిన భూములను బలవంతంగా తీసుకోరాదని, పేదల సాగులో ఉన్న ప్రభుత్వ బంజరు భూములకు, నివాస స్థలాలకు హక్కులు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో రాజమణి, పవన్, శిరీష, దీవెనమ్మ పాల్గొన్నారు



మాట్లాడుతున్న ఎ.రవి

ర్యాలీలు, రోడ్‌షోల నియంత్రణ జిఒను ఉపసంహరించాలి

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్రంలో ర్యాలీలను, సభలను, జాతీయ, రాష్ట్ర మున్సిపల్, పంచాయతీరాజ్ రోడ్లపైన, వాటి మర్జిన్లలో ఇక నుండి ఎలాంటి సభలకు అనుమతి లేదంటూ ఒకటో నెంబర్ జిఒను జారీ చేయడం అప్రజాస్వామికమని, రాజ్యాంగం కల్పించిన పౌర స్వేచ్ఛకు విరుద్ధమైన చర్య అంటూ ఆలిండియా లాయర్స్ యూనియన్(ఐలు) తీవ్రంగా ఖండించింది. పౌర స్వేచ్ఛను హరించే ఇలాంటి జిఒను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఐలు ఏలూరు టౌన్ యూనిట్ ఉపాధ్యక్షులు, న్యాయవాది పి.పరమేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు, న్యాయవాది కట్టా సత్యనారాయణ, ఐలు జిల్లా అధ్యక్షులు, న్యాయవాది శైలజ ప్రకటనలో డిమాండ్ చేశారు. పోలీసులకు సర్వాధికారులు కట్టబెట్టడం ప్రజాస్వామ్య వ్యవస్థకే ప్రమాదమని, పోరాడి సాధించుకున్న హక్కులను ఏ పేరుతో అణచివేసినా ఆలిండియా లాయర్స్ యూనియన్ వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు.

ఏలూరు టౌన్: అర్ధరాత్రి చీకటి మాటున దొంగచాటుగా జారీ చేసిన జిఒ ఒకటిని ఉత్తర్వులను రద్దు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సభలు, రోడ్ షోలు, ర్యాలీలు, సమావేశాలకు అనుమతి నిరాకరిస్తూ తీసుకొచ్చిన జిఒ ప్రతిపక్షాల గొంతు నొక్కడానికేనని విమర్శించారు. నాడు బ్రిటిష్ కాలంలో 1861 పోలీసు చట్టం ప్రకారం సెక్షన్ 30 అమలు చేశారని, స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాల తరువాత వైసిపి ప్రభుత్వం బ్రిటిష్ వారు చేసిన పోలీసు యాక్ట్ సెక్షన్ ఉదహరిస్తూ జారీచేసిన ఉత్తర్వులు అప్రజాస్వామికమన్నారు.

కుక్కునూరు: ర్యాలీలు, సభలు, ఇతరత్రా రోడ్లపై నిర్వహించే కార్యక్రమాలను నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన చీకటి జిఒ కాపీలను సిపిఐ మండల కమిటీ ఆధ్వర్యంలో పెదరావిగూడెంలో బుధవారం దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి మాట్లాడుతూ ర్యాలీలు, సభలు ఇతరత్రా రోడ్లపై జరుగు కార్యక్రమాలను నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం హోంశాఖ ద్వారా విడుదల చేసిన 1861 పోలీస్ యాక్ట్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు.

వేతనాలు చెల్లించాలని వినతి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మూడు నెలల వేతనాలు చెల్లించాలని కోయ భారతి వాలంటీర్లు గిరిజన సంఘం ఆధ్వర్యంలో బిటిడిఎ ఎపిఒ నాయుడుకు బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ 101 మంది కోయ భారతి విద్యా వాలంటీర్లను రెన్యువల్ చేయాలని, గతేడాది ఐదు నెలల జీతాల్లో రెండు నెలల జీతాలను చెల్లించారని మిగతా మూడు నెలల జీతాలను చెల్లించాలని కోరారు. గతంలో ఈ కోయ భారతి విద్యా వాలంటీర్ల సమస్యల గురించి కమిషనర్‌ను కలిశామని వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోయ భాషా జిల్లా అధ్యక్షులు కుంజ నవీన్, కోయ భారతి విద్యా వాలంటీర్లు పాల్గొన్నారు.

'మానవత' ఆధ్వర్యాన సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి - భీమడోలు

స్వచ్ఛంద సంస్థ భీమడోలు మానవతా శాఖ సేవా కార్యక్రమాల కొనసాగింపులో భాగంగా పూళ్ల గ్రామంలో బుధవారం పలు కార్యక్రమాలు చేపట్టినట్టు శాఖ అధ్యక్షులు వచ్చా వెంకటేశ్వరరావు, శాఖ ఛైర్మన్ జి.నూకరాజు తెలిపారు. దీనిలో భాగంగా పూళ్ల గ్రామానికి చెందిన ఒక యువకుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి వైద్యానికి సైతం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో అతనికి పోషకాహార నిమిత్తం రూ.ఐదు వేలు అందించారు. వృద్ధాప్యంలో అనేక బాధలు పడుతున్న దంపతులకు, అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఇంకొక కుటుంబానికి నిత్యావసర వస్తువులు, బియ్యం అందించారు. భీమడోలు సాయిరాం క్లాత్ స్టోర్స్ వారు మానవతా సంస్థ తరపున సదరు కుటుంబ సభ్యులకు దుస్తులను అందించారు.

యర్రంపల్లిలో ప్రత్యేక సేవా శిబిరం

ప్రజాశక్తి - చింతలపూడి

ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల్లో పాల్గొనడం అంటే దేశ సేవలో పాల్గొనడమని చింతలపూడి ఎఎంసి ఛైర్మన్ జగ్గవరపు జానకిరెడ్డి అన్నారు. చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో యర్రంపల్లిలో బుధవారం ప్రత్యేక సేవ శిబిరం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు వీధి వీధికి తిరిగి సామాజిక రుగ్మతలపై ప్రజలను చైతన్య పరుస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాజిక చైతన్య ర్యాలీలో పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య అవశ్యకత, మూఢ నమ్మకాలు, హెచ్ఐవి ఎయిడ్స్, రక్త, కంటి దానాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కొమ్ము ఆగ్నెస్, గ్రామ ఉప సర్పంచి జంగా చెన్నకేశవరెడ్డి, గ్రామస్తులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

అభినందనీయులు సునీల్‌కుమార్

చింతలపూడి :గ్రామీణ పేద యువతకు అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ నిర్వహించడం రాష్ట్ర సిఐడి డిజి సునీల్‌కుమార్ ఉన్నత వ్యక్తిత్వానికి నిదర్శనమని ఎఎంసి ఛైర్మన్ జగ్గవరపు జానకిరెడ్డి అన్నారు. స్థానికంగా ఎఎంసి మార్కెట్ యార్డు వద్ద ఎయిమ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్ఐ, కానిస్టేబుల్ ఉచిత శిక్షణ సెంటర్ వద్ద యువతకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కష్టపడి చదివి, ఉద్యోగం సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు మేలుగుమాటి నిరంజనకుమార్, ఎయిమ్ కోచింగ్ నిర్వాహకులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 16 మంది ఎంపిక

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం డిగ్రీ కాలేజీలో బుధవారం నిర్వహించిన జాబ్ మేళాలో 16 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి తెలిపారు. ఐసిఐసిఐ బ్యాంకు రిలేషన్ షిప్ మేనేజర్ పోస్టులకు 16 మంది ఎంపిక కాగా వారిలో 11 మంది విద్యార్థులు మూర్తి రాజు డిగ్రీ కళాశాలకు చెందిన వారని, మిగిలిన ఐదుగురు ఇతర కాలేజీలకు చెందిన వారని చెప్పారు. మేనేజింగ్ పోస్టులకు ఎంపికైన విద్యార్థులను వైస్ ప్రిన్సిపల్ పి.మధురాజు, లెక్చరర్ టి.అక్కరాజు, ఐవిల్ ఆర్‌కె ప్రసాద్, ఐసిఐసిఐ హెచ్ఆర్ అయ్యప్ప అభినందించారు.


సిఎం జగన్‌తో విప్పాడ వెంకన్న

సిఎం దృష్టికి నాయీ బ్రాహ్మణుల సమస్యలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

నాయీ బ్రాహ్మణులను ఆదుకోవాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి విన్నవించామని నాయీ బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి విప్పాడ వెంకన్న తెలిపారు. ఈ నెల మూడో తేదీ తూర్పు పశ్చిమగోదావరి జిల్లాల బూత్ రీజనల్ కోఆర్డినేటర్ బివిఆర్ చౌదరితో పాటు రాజమహేంద్రవరం పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి రాష్ట్రంలో ఉన్న నాయీ బ్రాహ్మణులకు అందిస్తున్న ప్రోత్సాహకాల గురించి గుర్తు చేశామని తెలిపారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి దృష్టికి 150 యూనిట్ల ఉచిత విద్యుత్ బార్బర్ షాపులన్నిటికీ అమలు చేయాలని కోరామని తెలిపారు. దేవాలయ పాలకవర్గంలో నాయీ బ్రాహ్మణులకు పూర్తిస్థాయిలో అవకాశం కల్పించాలని కోరామని తెలిపారు. తమ విన్నపాలపై ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సానుకూలంగా స్పందించారని విప్పాడ వెంకన్న తెలిపారు.

చింతలపూడి : రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో జరిగిన వైఎస్ఆర్ పెన్షన్ కానుక పెంపు కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌ను ఎఎంసి ఛైర్మన్ జగ్గవరపు జానకిరెడ్డి, జెడ్‌పిటిసి సభ్యులు ఎం.నిరంజన్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు ప్రధాన సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. నిర్మాణ దశలో ఆగిపోయి ఉన్న ఎపి రెసిడెన్షియల్ బాలుర గురుకుల పాఠశాల, బోయగూడెం-నాయుడుగూడెం రోడ్డు గురించి వివరించి త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు.

కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు

మండవల్లి :కోడిపందేలు నిర్వహించినవారిపై చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ టి.రామకృష్ణ హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఆయన మాట్లాడారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామాల్లో కోడిపందేలు, జూదం, గుండాట, మద్యం విక్రయించడం చట్టరీత్యా నేరమన్నారు. కోడి పందేలను అరికట్టేలా గ్రామ, మండల స్థాయిలో జాయింట్ యాక్షన్ కమిటీలను ఏర్పాటు చేశామని తెలిపారు. గ్రామాల్లోని అసాంఘిక కార్యకలాపాల ఆచూకీ తెలిస్తే యువత ముందుకు వచ్చి 9440796436 నెంబర్ సమాచారం అందించాలని తెలిపారు.

నేరాలు - ఘోరాలు

గొల్లపల్లిలో అంతర్రాష్ట్ర మద్యం పట్టివేత

ప్రజాశక్తి - నూజివీడు

మండలంలోని గొల్లపల్లిలో 250 అక్రమ మద్యం బాటిళ్లను నూజివీడు రూరల్ పోలీసులు బుధవారం సీజ్ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశానుసార విశ్వసనీయ సమాచారంతో రూరల్ సిఐ ఆర్.అంకబాబు, ఎస్ఐ తలారి రామకృష్ణ పోలీసు సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో కర్నాటక, పాండిచ్చేరి రాష్ట్రాలకు చెందిన 250 అక్రమ మద్యం బాటిళ్లు సీజ్ చేశారు. ఇద్దరిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచారు. పోలీసులు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిబ్బంది ఈ ఘటనపై విస్తృతంగా తనిఖీలు, విచారణ నిర్వహిస్తున్నారు.

11 మందిపై కేసు

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలులో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 11 మందిని అదుపులోకి కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ చావా సురేష్ తెలిపారు. వీరిని మంగళవారం భీమడోలు కోర్టుకు హాజరు పరిచామన్నారు. విచారణ అనంతరం భీమడోలు కోర్టు న్యాయమూర్తి టి.ఆదిత్య రిషిక్ ఒక్కొక్కరికి రూ.పదివేల వంతున జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

యువత క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలి

ప్రజాశక్తి - ముదినేపల్లి

యువత క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి పోటీలను జయప్రదం చేయాలని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని గురజలో బుధవారం ముదినేపల్లి పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండలస్థాయి టెన్నీస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను బ్యాటింగ్ చేసి ఎంఎల్ఎ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన సంవత్సరం, సంక్రాంతి పర్వదినాల సందర్భంలో యువత పెడదారి పట్టకుండా ఉండేందుకు క్రీడా పోటీలు ఏర్పాటు చేసిన పోలీసులకు అభినందనలు తెలిపారు. ఈక్రీడా పోటీల నిర్వహణలో మొదటి బహుమతి రూ.25వేలు అందిస్తున్న ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణను, ద్వితీయ బహుమతిగా రూ.15వేలు అందిస్తున్న జెడ్‌పిటిసి సభ్యులు ఈడే వెంకటేశ్వరమ్మ, వెంకటేశ్వరరావును, మూడో బహుమతిగా రూ.పది వేలు అందిస్తున్న మండల వైసిపి వాణిజ్య విభాగం అధ్యక్షులు బత్తుల కిషోర్‌లను ఎంఎల్ఎ

పోటీలను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ డిఎన్ఆర్

అభినందించారు. అనంతరం కోడూరు-గురజ జట్ల మధ్య జరిగే పోటీకి టాస్ వేసి ఆటను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కైకలూరు రూరల్ సిఐ నాయుడు, ముదినేపల్లి ఎస్ఐ షణ్ముఖసాయి, వైస్ ఎంపిపి రాచూరి రాధా, గ్రామ సర్పంచి ఎం.సరస్వతి, వైసిపి మండల అధ్యక్షులు ఎం.ఏసుబాబు, నాయకులు నిమ్మగడ్డ భిక్షాలు, బేతపూడి వెంకటరమణ, కె.ప్రవీణ్, బొర్రా శేషుబాబు, కె.విష్ణువర్ధన్, ఎం.వెంకటేశ్వరరావు, ఎం.నాగయ్య, మరీదు వసంతరావు , జాస్తి చంటి, పి.సుబ్బారావు పాల్గొన్నారు.

దెందులూరు :సంక్రాంతి పండుగను పురస్కరించుకుని యువత పేకాట, కోడిపందేలు వంటి జూదాలకు దూరంగా ఉండాలని దెందులూరు ఎస్ఐ ఇజ్జాపు వీర్రాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు దెందులూరు మండలం గోపన్నపాలెం కేంద్రీయ విద్యాలయ ప్రాంగణంలో జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు క్రికెట్ పోటీలను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత జూదాలకు అలవాటు పడటం వల్ల భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే పోలీసుల ఆధ్వర్యంలో ఈ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి క్రికెట్ జట్లు పోటీలో పాల్గొంటున్నాయన్నారు. గెలిచిన టీంలకు ప్రోత్సాహకాలను అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

జిఒ-1ని రద్దు చేయాలి

చింతలపూడిలో ప్రతులు దగ్ధం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - చింతలపూడి

జిఒ నెంబర్ -1ను రద్దు చేయాలని చింతలపూడి మండల వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఐ, సిపిఎం, సిపిఐ(ఎంఎల్) పార్టీల ఆధ్వర్యంలో పట్టణంలోని బోసుబొమ్మ సెంటర్‌లో జిఒ ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య, సిపిఎం నాయకులు ఎస్.సూర్యకుమార్, సిపిఐ ఎంఎల్ రెడ్ స్టార్ నాయకులు డి.రంగనాథ్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంపై నిరంతరం వస్తున్న వ్యతిరేకతను పక్కదాని పట్టించేందుకు ఏదో ఒక సాకు చూపుతున్నారన్నారు. జిఒ రద్దు చేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా నాయకులు ఎ.అప్పారావు, సిపిఐ మండల సహాయ కార్యదర్శి టి.బాబు, ఎపి రైతు సంఘం మండల అధ్యక్షులు ఎస్‌కె.కాలేశా, ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు పి.సత్యనారాయణ, ఎన్.తిరుపతి రావు, శ్రీను, సిపిఐ నాయకులు ఎస్‌కె జాని, వెంకటేశ్వ రరావు, లక్ష్మణరావు, ఎం.రామారావు, పి.రామకృష్ణ పాల్గొన్నారు.

ముసునూరు : చంద్రబాబు పర్యటనకు వస్తున్న ఆదరణ చూసి జగన్మోహన్ రెడ్డి ఓర్వలేక ఓటమి భయంతో చీకటి జిఒలను తీసుకురావడం సరికాదని టిడిపి తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దె రఘుబాబు అన్నారు. జిఒ-1 నిరసిస్తూ మండలంలోని గుడిపాడులో బుధవారం కాగాడాలతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రఘుబాబు మాట్లాడుతూ చంద్రబాబు కుప్పం పర్యటనకు అడుగడుగునా ఆటంకాలు సృష్టిస్తున్న ప్రభుత్వానికి నూకలు చెల్లాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ నాయకులు ధర్మరాజు, జిల్లా ఉపాధ్యక్షులు కొల్లి గంగారం, భాను ప్రకాష్, చింటూ పాల్గొన్నారు.

భీమడోలు : టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు కుప్పం పర్యటనను జిఒ-1 పేరుతో అడ్డుకోవడం సరికాదని టిడిపి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు తెలిపారు. ఈ మేరకు టిడిపి కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలు ధరించి భీమడోలు సంతపేటలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అంతకుముందు గన్ని వీరాంజనేయులు ఆధ్వర్యంలో టిడిపి కార్యకర్తలు భీమడోలు వెలంపేటలో ఇదేం ఖర్మ కార్యక్రమాన్ని చేపట్టారు.

నూజివీడు : రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తోందని, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనపై ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తం అవుతున్న నేపథ్యంలో, ప్రజల నిరసనను అనగదొక్కేందుకు రాష్ట్ర ప్రభుత్వం జిఒ-1 తీసుకొచ్చిందని టిడిపి నూజివీడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం ఆయన స్థానిక టిడిపి కార్యాలయంలో మాట్లాడుతూ ప్రతిపక్షాలు గొంతు నొక్కి ఇందుకు ప్రభుత్వంపై వస్తున్న వ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకు ఈ జిఒ తీసుకొచ్చారన్నారు. ప్రజల బాధలు గాలికి వదిలేసిన ముఖ్యమంత్రి జగన్ ఒక్కడే అని ముద్దరబోయిన అన్నారు.

బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - టి.నరసాపురం

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి కుటుంబానికి ఫర్ ద పీపుల్ బృందం బుధవారం రూ. 21 వేలు ఆర్థిక సాయం అందించారు. మండలంలోని మధ్యాహ్నపువారిగూడెం గ్రామానికి చెందిన అనగాని సూర్యరావు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. విషయం తెలుసుకున్న మండలంలోని బొర్రంపాలెం గ్రామానికి చెందిన సామాజిక వేత్త ఫర్ ద పీపుల్ పేరుతో మిత్రులు మరికొందరు పరిచయస్తుల ద్వారా నిధులు సేకరించడంతో రూ.21వేలు దాతలు అందించడంతో వాటిని విజయ్ తన బృందంతో బాధిత కుటుంబానికి అందించారు. ఆపదలో ఉన్న వారికి సాయం అందించడం నిజమైన మానవత్వానికి నిదర్శనమని పలువురు అబినందించారు.

పేదలకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి - గణపవరం

పూర్ణిమ మెమోరియల్ హిరామెన్‌వేర్ ఫెయిర్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం గణపవరం మార్కెట్‌లో ఉన్న పేద ప్రజలకు టీ షర్టులు, చలి బనియన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్మన్ తుల ఆదినారాయణ మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. దీనిలో భాగంగా శీతాకాలంలో చలితో ఇబ్బంది పడుతున్న పేద ప్రజలకు తమ సంస్థ తరపున దుస్తులు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో తులా శ్రీనివాసు, ఎస్.శంకరం పాల్గొన్నారు.

పన్ను వసూలు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - భీమడోలు

గ్రామ పంచాయతీలు ఈ నెలాఖరుకు 50 శాతం, ఫిబ్రవరి నెలాఖరుకు నూరు శాతం పన్నుల వసూలు లక్ష్యంగా నిర్ణయించుకోవాలని భీమడోలు ఎంపిడిఒ రాఘవన్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రామపంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో సామూహిక మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని, మరుగుదొడ్ల నిర్మాణం పట్ల ఆసక్తిగల లబ్ధిదారుల వివరాలు ఆర్‌డబ్ల్యూఎస్ వెబ్‌సైట్‌లో నమోదయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్లాస్టిక్ నిషేధంపై విస్తృత స్థాయిలో ప్రచారం చేయాలని ఆదేశించారు. వివిధ శాఖల భవన నిర్మాణాలు ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో కోడిపందేలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, ప్రజలను చైతన్య పరచాలని తెలిపారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - కైకలూరు రూరల్

విద్యావ్యవస్థలో సిఎం జగన్ విప్లవాత్మకమైన మార్పులు చేశారని జెడ్‌పిటిసి సభ్యులు కురెళ్ల బేబి తెలిపారు. మండలంలోని ఆటపాక నిమ్మగడ్డ నాగభూషణం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు స్ఫూర్తి స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ప్రయివేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి, ఉచితంగా బైజూస్ కాంటెట్‌తో కూడిన ట్యాబ్స్ అందిస్తున్నారన్నారు. ఈ కారక్రమంలో ఆటపాక సర్పంచి తలారి జాన్‌మణి, హై స్కూల్ హెడ్ మాస్టర్ అల్లూరి రవిప్రకాష్, జగన్, పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాలు త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - నూజివీడు

మండలంలోని రావిచర్లలో నిర్మాణాల నిమిత్తం ఉంచిన 400 సిమెంటు బస్తాలు గడ్డకట్టాయని గ్రామ సర్పంచి కాపా శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఆయన బుధవారం మాట్లాడుతూ ఇప్పటివరకు వీటిపై సంబంధిత అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. పంచాయతీ సభ్యుల అందరి ఆమోదంతో సచివాలయం, వెల్నెస్ సెంటర్, ఆర్‌బికె భవన నిర్మాణాలకు తీర్మానాలు చేశారన్నారు. పంచాయతీ బోర్డు తీర్మానించిన ప్రదేశంలో భవన నిర్మాణాలు చేపట్టారని, ఆ తీర్మానాన్ని రద్దు చేయాలని చెప్పటం హేయమైన చర్యగా పేర్కొన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నత స్థాయి అధికారులు స్పందించి పంచాయతీ సభ్యులందరి తీర్మానం మేరకు సచివాలయం, వెల్నెస్ సెంటర్, ఆర్‌బికె భవనాల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

ప్లాస్టిక్ నిషేధంపై ప్రత్యేక డ్రైవ్

ప్రజాశక్తి - భీమడోలు

ప్లాస్టిక్ వినియోగంపై నిషేధమున్న నేపథ్యంలో భీమడోలు మండలంలో అన్ని గ్రామ పంచాయతీల్లో అధికారులు ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామ పంచాయతీల పరిధిలో వ్యాపారుల నుంచి 32 కేజీల బరువు గల ప్లాస్టిక్ కవర్లను స్వాధీన పర్చుకున్నట్లు ఎంపిడిఒ రాఘవన్ తెలిపారు. వీటిని భీమడోలులోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి తరలించామన్నారు. అక్కడ ప్లాస్టిక్ కవర్లను తారు రోడ్ల నిర్మాణంలో వినియోగానికి అనువుగా తయారు చేసేందుకు ప్రత్యేక యంత్రాల సహకారాన్ని తీసుకోనున్నట్లు తెలిపారు. భీమడోలు గ్రామపంచాయతీ కార్యదర్శి ఎన్.ఠాగూర్ ఆధ్వర్యంలో మహిళా సంరక్షణ అధికారులు ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరికి స్వచ్ఛంద సంస్థ చైతన్య యువజన సంఘం అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు సహకరించారు. ఈ సందర్భంగా చైతన్య యువజన సంఘం అధ్యక్షులు డాక్టర్ పి.మాన్‌సింగ్ సింగల్ యూస్ ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు.

భీమడోలు సిహెచ్‌సి సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా రేష్మ

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా డాక్టర్ కె.రేష్మ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ కె.శ్వేతతో పాటు సీనియర్ వైద్యులు వి.రవిపాల్, డాక్టర్ సునీత, డాక్టర్ అరవిందలను ఆమె కలిశారు. డాక్టర్ కె.రేష్మ ఒంగోలు రిమ్స్ వైద్య కళాశాల నుంచి 2019లో పట్టా పొందారు. ఆ తర్వాత పీజీలో ప్రవేశానికి నిర్వహించిన పరీక్షల్లో పాల్గొని అర్హత పొందారు. కానీ ఆశించిన విభాగంలో సీటు రానందువల్ల వైద్యులుగా కొనసాగేందుకు పనిచేసే క్రమంలో అప్పట్లో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో నవజాత శిశువుల ప్రత్యేక వైద్య నిపుణురాలిగా, ఆ తర్వాత నిర్వహించిన కౌన్సెలింగ్‌లో భీమడోలులోనే దీర్ఘకాలిక వ్యాధుల నిపుణురాలిగా నియామకం పొందారు. తాజాగా నిర్వహించిన కౌన్సెలింగ్‌లో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా నియామకం పొందారు. సామాజిక ఆరోగ్య కేంద్రానికి తాజాగా సివిల్ అసిస్టెంట్ సర్జన్ రాక వల్ల ఇతర వైద్యులపై కొంత పని భారం తగ్గిందని సూపరింటెండెంట్ డాక్టర్ కె.శ్వేత తెలిపారు.

డాక్టర్ కె.రేష్మ

బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ కె.శ్వేతను సామాజిక ఆరోగ్య కేంద్ర పర్యవేక్షకులతోపాటు ఇతర వైద్యులు, సిబ్బంది అభినందించారు.

పలుచోట్ల 'గడపగడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జన సంక్షేమమే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు అన్నారు. తాటియాకులగూడెం పంచాయతీలోని బర్రింకలపాడు, ఉదయభాస్కర్ కాలనీలో బుధవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం బర్రింకలపాడు గురుకుల పాఠశాలలో రూ.95 లక్షలతో అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని ప్రారంభించారు. బర్రింకలపాడులో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభలో పాల్గొని మండలంలో నూతనంగా మంజూరైన 153 పెన్షన్‌లను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కొర్స పోసమ్మ, జెడ్‌పిటిసి సభ్యులు వసంతరావు, వైస్ ఎంపిపి సోమగాని శ్రీనివాసరావు, ఎంపిటిసి సభ్యులు సున్నం సురేష్, సర్పంచి వనమా రాంబాబు, తహశీల్దార్ జి.ఎలీషా, ఎంపిడిఒ మంగతాయారు, ఎంఇఒ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మండవల్లి : మండలంలోని లోకమూడిలో బుధవారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్, వైస్ ఎంపిపి అగస్తి ఆదివిష్ణు, మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ జంపాన కొండరాజు, సర్పంచులు తలారి ధనలక్ష్మి, కరేటి నాగలక్ష్మి, సర్పంచుల సంఘం అధ్యక్షులు బేతపూడి ఏసేబురాజు పాల్గొన్నారు.

భీమడోలు : మండలంలోని పూళ్ల గ్రామంలో బుధవారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉంగుటూరు ఎంఎల్ఎ వాసుబాబు పాల్గొన్నారు. ఈ క్రమంలో ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిశారు. వారికి ఏ మేరకు ప్రభుత్వ పథకాలు అందిన విషయమై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో భీమడోలు ఎంపిపి కె.ఆదాం, ఎఎంసి ఛైర్ పర్సన్ ఇంజేటి నీలిమ జూనియర్, సర్పంచి దాయం సుజాత, గుండుగొలను సొసైటీ అధ్యక్షులు వివివి.భాస్కర్, గ్రామపంచాయతీ కార్యదర్శి సూర్య కుమార్ పాల్గొన్నారు.

ప్రత్యేక పంచాయతీ కోరుతూ సంతకాల సేకరణ

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండల కేంద్రమైన టి.నరసాపురం పంచాయతీ పరిధిలోని కృష్ణాపురం, పుట్రేపు, ప్రకాష్ నగర్, రుద్రకోటరాజుగూడెం, కాపుగూడెం ఐదు గ్రామాలను కలిపి ప్రత్యేక గ్రామ పంచాయతీ ఏర్పాటు చేయాలని కోరుతూ మండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన యువకులు బుధవారం ప్రజల సంతకాలను సేకరించారు. టి.నరసాపురం పంచాయతీలో ఐదు గ్రామాలు ఉండడం వల్ల అనేక అబివృద్ధి కార్యక్రమాలు అందడంలేదని ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు ద్వారా ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. సంతకాలు సేకరించిన అనంతరం సోమవారం జిల్లా కలెక్టర్‌కి వినతిపత్రం అందిస్తామని వారు తెలిపారు. సంతకాలు సేకరించిన వారిలో భూక్యా వేణుగోపాల్, ధరవాత్తు స్వామి, జరబల బాలకృష్ణ, సుకలి, రాములు, కిషోర్ పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు

ప్రజాశక్తి - దెందులూరు

ఇచ్చిన మాటకు కట్టుబడి రూ.రెండు వేలు ఉన్న పింఛను దశలవారీగా రూ.2750 పెంచి అందిస్తున్నారని ఎంఎల్ఎ కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. దెందులూరు వ్యవసాయ సొసైటీ ప్రాంగణంలో బుధవారం జరిగిన నూతన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన మండలంలోని కొత్తగా మంజూరైన 298 మంది లబ్ధిదారులకు పెన్షన్లను అందించారు. జనవరి ఒకటో తేదీ నుంచి దెందులూరు నియోజకవర్గంలో 1199 మంది లబ్ధిదారులకు కొత్తగా పెన్షన్లు మంజూరయ్యాయని, దీంతో ప్రస్తుతం అమలులో ఉన్న 35548 మందితో కలిపి మొత్తంగా 36747 మంది లబ్ధిదారులకు పెన్షన్లు అందిస్తున్నామని చెప్పారు.

జంగారెడ్డిగూడెం :రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ పెన్షన్లు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని చింతలపూడి ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా అన్నారు. స్థానిక రాజా రాణి కళ్యాణ మండపంలో నూతన పెన్షన్లు పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎంఎల్ఎ ఎలిజా మాట్లాడుతూ ప్రతి ఇంటికి వాలంటరీ వ్యవస్థ ద్వారా పెన్షన్ అందించడం ఒక చరిత్ర అని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ బత్తిన నాగలక్ష్మి, వైస్ ఛైర్మన్లు కంచర్ల వాసవి, ముప్పిడి వీరాంజనేయులు, పట్టణ అధ్యక్షులు పిపిఎన్.చంద్రరావు, ఉమెన్ వెల్ఫేర్ రీజినల్ కోఆర్డినేటర్ వందనపు సాయిబాలపద్మ, వైసిపి సీనియర్ నాయకులు మేడవరపు విద్యాసాగర్, సొసైటీ అధ్యక్షులు వందనపు వెంకటేశ్వరరావు, చింతలపూడి మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ తాతకుంట్ల రవికుమార్, మున్సిపల్ కమిషనర్ భవానీప్రసాద్, మున్సిపాలిటీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

కైకలూరు రూరల్ :ఇచ్చిన మాటకు నిలబడి పెన్షన్ల సొమ్మును పెంచి అందిస్తున్న జగనన్నకు ప్రత్యేక కృతజ్ఞతలని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మార్కెట్ యార్డ్ ప్రాంగణంలోని రైతు కళ్యాణ మండపంలో నూతనంగా మంజూరైన 310 మంది లబ్ధిదారులకు పెన్షన్లను ఆయన బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత పెన్షన్ క్రమంగా పెంచుతూ ఇప్పుడు రూ.2,750 పంపిణీ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమానికి ఎంపిపి అడవి వెంకట కృష్ణ మోహన్ అధ్యక్షత వహించగా జెడ్‌పిటిసి సభ్యులు కురెళ్ల బేబి, ఎఎంసి ఛైర్మన్ పుష్పలత పాల్గొన్నారు.

నాగేశ్వరరావును సత్కరిస్తున్న పోలీసులు

ఎస్ఐకి సన్మానం

ప్రజాశక్తి - టి.నరసాపురం

స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎఎస్ఐగా పనిచేస్తూ ఎస్ఐగా ఉద్యోగోన్నతి పొంది బదిలీపై భీమవరం వెళ్తున్న ఎఎస్ఐ కె.నాగేశ్వరరావును బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో జీలుగుమిల్లి సిఐ జి.వెంకటేశ్వరావు, ఎస్ఐ కె.సతీష్‌కుమార్ సన్మానించారు. నాలుగున్నర ఏళ్లగా స్థానికంగా అందించిన సేవలు అభినందనీయమని కొనియాడారు. ఎస్ఐగా ప్రమోషన్ పొందిన ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు రాజు, రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతి

ప్రజాశక్తి - నిడమర్రు

లూయిస్ బ్రెయిలీ లిపిని కనిపెట్టి ఎందరో అంధులకు వెలుగు ప్రసాదించిన లూయిస్ బ్రెయిలీ పుట్టినరోజు వేడుకలు నిడమర్రు భవిత స్కూల్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రాథమిక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఎర్రంశెట్టి శేషగిరిరావు మాట్లాడుతూ ప్రపంచంలోని అంధులకు వెలుగు ప్రసాదించిన వ్యక్తి లూయిస్ బ్రెయిలీ అని కొనియాడారు. అనంతరం వికలాంగులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ పి.జేమ్స్‌బూన్, లక్ష్మీకాంతం, యేసురాజు, వరలక్ష్మి, వికలాంగ పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గణపవరం : అంధులకు చదువుకునే అవకాశం కల్పించిన లాలా బ్రెయిలీ ధన్యజీవని గణపవరం ఎంఇఒ పి.శేషు అన్నారు. బ్రెయిలీ జయంతి సందర్భంగా పిప్పర హైస్కూలులో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచి కాకర బేబీ అధ్యక్షత వహించారు. కేకును కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు పి.ప్రసన్నకుమార్, మాజీ సర్పంచి శెట్టి ఏసుబాబు, పి.లీల పాల్గొన్నారు.

ముసునూరు : మండలకేంద్రమైన ముసునూరు మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలలో భవిత సెంటర్‌లో ప్రధానోపాధ్యాయులు హెచ్.హన్నామణి ఆధ్వర్యంలో లూయిస్ బ్రెయిలి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వికలాంగ విద్యార్థులతో కేక్ కట్ చేయించారు. వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌వి.నారాయణరావు, జె.నాగమల్లేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కైకలూరులో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి - కైకలూరు రూరల్

ప్రజా సమస్యల పరిష్కారానికి టిడిపి కృషి చేస్తుందని మాజీ ఎంఎల్ఎ జయమంగళ వెంకటరమణ అన్నారు. మండలంలోని కైకలూరు పట్టణం ఇస్లాంపేటలో బుధవారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షులు పెన్మెత్స త్రినాధరాజు, తెలుగురైతు రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యపరాజు గుర్రాజు, రాష్ట్ర వాణిజ్యవిభాగం ప్రధాన కార్యదర్శి పైడిమర్రి మాల్యాద్రి, జిల్లా పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి పోలవరపు లక్ష్మీరాణి, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు విజయలక్ష్మి పాల్గొన్నారు.

'టిడిపి బలోపేతానికి కృషి చేయాలి'

ప్రజాశక్తి - ముదినేపల్లి

పార్టీ బలోపేతానికి అందరూ కలిసి కట్టుగా కృషి చేయాలని టిడిపి నేత కేసినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. టిడిపి యువనేత కొడాలి వినోద్‌ను ఆయన స్వగృహంలో కేసినేని శివనాథ్ బుధవారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా కేసినేని శివనాథ్ మాట్లాడుతూ రానున్న సాధారణ ఎన్నికల్లో పార్టీ విజయానికి అందరం కలిసి కట్టుగా పని చేసి టిడిపిని అధికారంలోకి తీసుకువచ్చేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వెనిగళ్ల రాము, తానా అధ్యక్షులు లావు అంజయ్యచౌదరి పాల్గొన్నారు.

మహారాజశ్రీ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి, ఏలూరు వారి కోర్టులో

EP No.59/2019 in O.S. No. 153/2014

Between :
శ్రీ కొండేటి హనుమంతు .... డిక్రీహోల్డరు/ వాది
And
శ్రీమతి అంబటి గంగాజలం ... జడ్జిమెంటు డెటారు/ ప్రతివాది

పై నంబరు గ్రంథములో డిక్రీ బాకి రాబట్టుకునే నిమిత్తం జడ్జిమెంట్ డెటారు/ ప్రతివాది సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములో గల ఈ క్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని ది.20.01.2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట బహిరంగ వేలం వేయుదురు. ఎవరైననూ వేలం పాటలో పాల్గొని, స్థిరాస్తిని వేలంపాటలో పాడుకోవచ్చును. షరతులు వర్తించును.

షెడ్యూలు ఆస్తి వివరము : (పశ్చిమ గోదావరి జిల్లా) ఏలూరు జిల్లా, భీమడోలు సబ్ రిజిస్ట్రారు యిలాకా గాలాయిగూడెం గ్రామంలో గల ఆర్.యస్.నెం. 198/6 దాఖలా ఎ.1.00 (ఒక ఎకరం) మెరక భూమికి హద్దులు : **తూర్పు** : అంబటి గంగరాజు గారి భూమి, **దక్షిణం** : అంబటి గంగరాజు గారి భూమి, **పడమర** : పూజారి లక్ష్మణరావు గారి భూమి, **ఉత్తరం** : అంబటి గంగరాజు గారి భూమి.
ఈ హద్దుల మధ్య ఎ.1.00 మెరక భూమి వేలం వేయుదురు.
డిక్రీ హోల్డరు విలువ రూ.10,00,000/-
ప్రభుత్వం వారి విలువ రూ.29,00,000/-
(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

స్థలం : ఏలూరు తేది : 04-01-2023

ఇట్లు :
ఈడ్పుగంటి శ్రీనివాస బాబు,
అట్లూరి రవికుమార్,
న్యాయవాదులు, ఏలూరు.